రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఉట్టిపడ్డ ఉత్సవ సందడి

ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలుపాఠశాలల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ర్యాలీ నిర్వహించి, సాంస్కృతిక ప్రదర్శనలు ఉట్టికొట్టే కార్యక్రమంతో అలరించారు.



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో శంషాబాద్ చిన్నారులు

**దుద్యాల:** బొంరాస్పేట్ మండల కేంద్రంలోని రెయిన్బో పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ర్యాలీ నిర్వహించి, సాంస్కృతిక ప్రదర్శనలు ఉట్టికొట్టే కార్యక్రమంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

**ధారూర్:** నాగారం గ్రామంలోని సన్ షైన్ పాఠశాల చిన్నారులు దివ్యమైన వేషధారణలతో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**షాద్‌నగర్ :** సాయిరాజ్ ఫంక్షన్ హాల్లో బాల గోకుల సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణగోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. ఏసీపీ లక్ష్మీ నారాయణ, సీఐ సీతారాం ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. **కొత్తూరు :** శ్రీ శివ మారుతి దేవాలయంలో స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో శోభాయాత్ర, పూజలు, ఉట్టి కొట్టే సంబరాలు యోగేశ్వర విజయతే నామస్మరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి.

**యాలాల:** మండలవ్యాప్తంగా ఇళ్లల్లో, పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. కోకట్ గ్రామానికి చెందిన చిన్నారి కరణం మయాంక్ వేణువు, నెమలి పించంతో బాల కృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

**షాబాద్:** నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయం, షాబాద్ వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**జిల్లేడు చౌదరిగూడెం:** మండల పరిధిలోని గ్రామాల్లో చిన్నారులు కృష్ణ, గోపికల పాత్రల్లో ఉత్సాహంగా నృత్యాలు చేసి ఉట్లు కొట్టారు.

**శంషాబాద్:** పాఠశాలల్లో చిన్నారులు వెన్న దొంగిలించే లీలలను ప్రదర్శించారు. బ్రాహ్మణ వాడ శ్రీకృష్ణ మందిరంలో డోలాహరణ పూజలు నిర్వహించగా, మహిళలు ఇళ్ల ముందు చిన్ని కృష్ణుడి పాదాల ముగ్గులు వేశారు.

**దౌల్తాబాద్ :** తిమ్మారెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల వేషధారణల మధ్య అంగ న్వాడీ టీచర్లు శ్రీకృష్ణుని బాల్య లీలలు, భగవద్గీత ప్రాశస్త్యాన్ని వివరించారు. **శామీర్‌పేట:** భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర జరగగా, దివ్యజ్యోతి హైస్కూల్ విద్యార్థులు వేషధారణలతో అలరించారు.

**ఘట్‌కేసర్ :** బాలాజీనగర్ గీతామందిర్, ఎదులాబాద్ వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజ లు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి.



## నేడు ఇందిరాపార్క్ బిజెపి నిరసన దీక్ష

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చినందుకు బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నామని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఇందిరాపార్కులో బీజేపీ చేపట్టబోయే నిరసన దీక్ష ఏర్పాట్లను ఆయన బీజేపీ నాయకులు మహేశ్వరరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ మూడేళ్ల రేవంత్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిషేధిత జాబితాలో 16 లక్షల ఎకరాలు ఉంటే రేవంత్‌రెడ్డి వచ్చి, 80 లక్షల ఎకరాలకు పెంచారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌లను, కాలనీలను, ఎన్నో ఏళ్లుగా దున్నుకుంటు న్న భూములను ఎటువంటి నోటీస్‌లు లేకుండా నిషేధిత జాబితాలో చేర్చారని ధ్వజమెత్తాఉ. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బీజేఎల్పీ నేత మహేశ్వరరెడ్డి నాయకత్వంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు శనివారం ఉదయం 10 గంటల నుంచి ఇందిరాపార్కు వద్ద దీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు

# ప్రతి తండాకూ రోడ్డు

★వచ్చే ఏడాది డిసెంబర్‌కు డెడ్‌లైన్ ★రహదారి లేదన్న ఫిర్యాదు రాకూడదు ★కొడంగల్ అభివృద్ధిపై సీఎం ఫోకస్ ★పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలుంటాయని వార్నింగ్ ★హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన







సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, అభివృద్ధి పనులపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న దృశ్యం

**దుద్యాల/దౌల్తాబాద్, సెప్టెంబరు 4,ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి ఫోకస్ పెట్టారు. శుక్రవారం హకీంపేటలోని 228 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన సీఎం.. అనంతరం కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ శాఖల అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి తండాకు రోడ్డు సౌకర్యం కల్పించి అన్ని రోడ్లను డిసెంబర్ 2027లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క తండాకు రోడ్డు లేదనే ఫిర్యాదు రాకూడదని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో జాప్యం, నాణ్యతలో లోపాలను ఎంతమాత్రం సహించబోమని అధికారులను సీఎం హెచ్చరించారు. దౌల్తాబాద్ అంబేద్కర్ విగ్రహం నుంచి చంద్రవంచ మీదుగా మహబూబ్‌నగర్-చించోలి-అలిపే రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఎత్తిపోతల ప్రాజెక్టు మూడు దశల పనులను సమాంతరంగా వేగవంతం చేయడంతోపాటు 81 కిలోమీటర్ల రేడియల్ రోడ్డుకు భూసేకరణ, టెండర్లను అక్టోబర్ చివరినాటికి పూర్తి చేసి నవంబర్ 1 నుంచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. 4 వేల ఎకరాల సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిధుల కొరతతో పనులు ఆగిపోయాయనే పరిస్థితి రాకూడదని, అవసరమైన నిధులు సకాలంలో విడుదలయ్యేలా చూడాలని ఆర్థిక శాఖ కార్యదర్శికి ఆదేశించారు.

దౌల్తాబాద్ మండలంలో శుక్రవారం పర్యటించారు. గోకఫస్లావాద్‌లో 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, దౌల్తాబాద్ మండల కేంద్రంలో 4.80 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న జూనియర్ కళాశాల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గోకఫస్లావాద్ హెలిపాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, డీఐజీ చందన దీప్తి, ఇన్‌చార్జ్ ఎస్పీ పారితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, సీఎం ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ వద్దకు వచ్చిన స్థానిక ప్రజలను సీఎం ఆప్యాయంగా పలకరించి వారితో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... ఇంజనీరింగ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అత్యంత నాణ్యతతో, పటిష్టంగా చేపట్టాలని స్పష్టం చేశారు. నూతన సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు విద్యార్థులకు మెరుగైన, సౌకర్యవంతమైన వసతులు సమకూరేలా నిర్మాణాలు ఉండాలని సూచించారు. పర్యటనలో భాగంగా దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాల, హనుమాన్ దేవాలయం వద్ద గుమికూడిన స్థానిక ప్రజలను ముఖ్యమంత్రి స్వయంగా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్‌రెడ్డితో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ కమలంలో రాజకీయ కాక

### బిజెపిలో రాజుకున్న అసమ్మతి జ్వాలలు
### అధిష్టానానికి ఫిర్యాదుల పర్వం
### విచారణకు ఆదేశించిన హైకమాండ్

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో షాద్ నగర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన అందే బాబయ్య, స్థానిక నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిపై పార్టీ క్రమశిక్షణా ఉల్లంఘనలు, సమాంతర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారంటూ ఆగస్టు 26, 2026న బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ చందర్ రావుకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ వినతిపత్రంలో అందే బాబయ్య ప్రధానంగా పేర్కొన్న అంశాలలో..

2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ రాకపోవడంతో విష్ణు వర్ధన్ రెడ్డి పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీలను తన్ని, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఆ తర్వాత ఆయన ఫోర్వర్డ్ బ్లాక్ పార్టీ ఖిసింహంఖి గుర్తుపై పోటీ చేశారని తెలిపారు.



రామచందర్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న అందె బాబయ్య

**సమాంతర కార్యకలాపాలు:** లోక్‌సభ ఎన్నికల సమయంలో తిరిగి బీజేపీలోకి వచ్చినప్పటికీ, అధికారిక పార్టీ యంత్రాంగంతో కలవకుండా నియోజకవర్గంలో స్వతంత్రంగా, సమాంతరంగా రాజకీయ కార్యకలాపాలు నడుపుతూ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా పార్టీ నిర్వహించే ముఖ్యమైన సమావేశాలు, కార్యక్రమాలకు హాజరుకాకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. వందేమాతరం గేయానికి అవమానం చేశారని పార్టీ అధికారిక సమావేశంలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న సమయంలో విష్ణువర్ధన్ రెడ్డి మద్దతుదారులు ఆయన పేరు ప్రస్తావించలేదనే నెపంతో అడ్డంకులు సృష్టించారని, ఇది జాతీయ గీతానికి, పార్టీకి జరిగిన అవమానమని తెలిపారు.

**ఏఐఎస్‌ఎఫ్ నిరసనలో భాగస్వామ్యం..**

జిల్లా లేదా రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి సమాచారం ఇవ్వకుండా, అనుమతి లేకుండా ఇటీవల షాద్ నగర్ లో పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొనడం వల్ల పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొందని లేఖలో ప్రస్తావించారు.

**అనధికార హోదాలతో ప్రచారం..**

2023 ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేయకపోయినా, తనను తాను బిజెపి కంటెస్టింగ్ ఎమ్మెల్యే మరియు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్" అని పేర్కొంటూ పోస్టర్లు, ప్రచార సామగ్రి ద్వారా ప్రజలను, కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నారని అందే బాబయ్య ఆరోపించారు.

దీనిపై పరిశోధన జరిపి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రారావు మరోసారి ఇచ్చినట్లు బాబయ్య మీడియాకు తెలిపారు.



చెరువులో వ్యర్థాల ఏరివేతను పరిశీలిస్తున్న చైర్మన్ పత్యనాయక్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

## చెత్త వేస్తే రూ.50 వేలు జరిమానా

**ఆమనగల్లు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎటువంటి చర్యలను మున్సిపాలిటీ ఉపేక్షించబోదని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఇంటి పరిసరాలతోపాటు ఇతర స్థలాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములై ప్రభుత్వ లక్ష్యాలకు సహకరించాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని సురసముద్రం చెరువును శుక్రవారం మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యనాయక్‌తో కలిసి సందర్శించారు. స్థానిక చెరువులో కొంతమంది బాధ్యతరహితంగా చెత్తవేయడంతో పెద్దఎత్తున పేరుకుపోయిన వ్యర్థాల గురించి సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో వీరు వెంటనే స్పందించి చెరువును సందర్శించారు. అక్కడి పరిస్థితులపై చూసిన చైర్మన్, కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా చెరువులో వ్యర్థాలను వేయడం సరైన పద్ధతి కాదని ప్రజల్లో వ్యక్తిగత సమాజ బాధ్యత కూడా కలిగి ఉండాలని తెలిపారు. ఇష్టానుసారంగా వ్యర్థాలను తీసుకువచ్చి చెరువులో వేసే వారిని గుర్తిచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, వారిపై ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా కఠిన చర్యలు తీసుకుని రూ 50 వేలు జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు. కాగా చెరువు సుందరీకరణకు త్వరలోనే ప్రణాళికలు రచించి టూరిజం స్పాట్‌గా, ప్రజలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈమేరకు మున్సిపాలిటీ సిబ్బందితో వ్యర్థాల ఏరివేతను కొనసాగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనుముల రమేష్, ఎర్రవోలు మహేష్, నాగిళ్ల జగన్, మొక్తాల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## 241 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో నూతనంగా ఎంపికైన 241 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ శుభాకాంక్షలు తెలిపింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి, ప్రధానోపాధ్యాయులకు, విద్యా రంగానికి సేవలందిస్తున్న వారికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు మధ్యాహ్నం ఒంటి గంటకు ఇబ్రహీంపట్నం నిమోజకవర్గంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు సమాచారం అందించి, సకాలంలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని కోరారు. అలాగే జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కూడా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి సహకరించాలని జిల్లా విద్యాశాఖ కోరింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని డీఈఓ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## 14 వరకూ ధూల్‌పేట్ ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త**

ట్రాఫిక్ అడ్వైజరీ ధూల్‌పేట్ ప్రాంతం నుండి వినాయక విగ్రహాల విక్రయాలు, కొనుగోలు మరి యు రవాణాను దృష్టిలో ఉంచుకుని ఈనెల 5వ తేదీ శనివారం ఉదయం 7గంటల నుండి 14వ తేదీ రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి.నగర పౌరులు ఈ ట్రాఫిక్ మళ్లింపులను గమనించి, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచు కోవాల్సిందిగా విజ్ఞప్తి చేయడమైనది. తాజా ట్రాఫిక్ సమాచారం కోసం మా సోషల్ మీడియా వేదికలైన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ,ట్విట్టర్ ఖాతాలను అనుసరించగలరు. ప్ర యాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) డి.జోయల్ డేవిస్ తెలిపారు.

-బోయిగూడ కమాన్ నుండి గాంధీ విగ్రహం వరకు మరియు గాంధీ విగ్రహం నుండి బోయిగూడ కమాన్ వైపు సాధారణ వాహనాల రాకపోకలను అనుమతించరు. - వినాయక విగ్రహాల రవాణా కోసం వచ్చే వాహ నాలు పూరానాపూల్, గాంధీ విగ్రహం మార్గం నుండి ప్రవేశించి, భోయిగూడ కమాన్ ఎక్స్ రోడ్స్ ద్వారా బయటకు వెళ్లాలి. -మంగళ్‌హాట్ వైపు వెళ్లడానికి పూరానాపూల్, గాంధీ విగ్రహం మార్గాల ద్వారా వచ్చే సాధారణ లారీలు మరియు ఇతర సాధారణ వాహనాలను టక్కర్‌వాడి గిజంక్షన్, జిన్సీ చౌరాహి, ఘోడేకీఖబర్ వైపు మళ్లిస్తారు.

# చెట్ల పొదల్లో యువతి మృతదేహం

★రైల్వేట్రాక్ వద్ద గుర్తించిన స్థానికులు ★కుళ్లిపోయి గుర్తు తెలియకుండా మారిందని పోలీసులు వెల్లడి ★చనిపోయి పది రోజులవుతుందని అంచనా ★కొనసాగుతున్న కేసు దర్యాప్తు

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యంనంపేట్ గ్రామ శివారులో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని మహిళా మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు కనుగొన్నట్లు తెలిపారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల దగ్గర గల రైల్వేట్రాక్ ప్రక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని మహిళా మృత దేహం పడిఉందని కళాశాలకు చెందిన సెక్యూరిటీ గార్డు చూసి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించగా మృత దేహంపై పింక్ కలర్ ప్యాంటు, టీ షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. టీ షర్టుపై తెలుపు రంగు చిన్నచిన్న ఫ్లవర్స్ గల దుస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు వయస్సు అందాజ 30 నుండి 40 సంవత్సరాలు ఉంటుందని అన్నారు. మృతురాలిని గుర్తించడానికి వీలులేని విధంగా కుళ్లిపోయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు చనిపోయి వారం నుండి పది రోజులు కావచ్చని అన్నారు. మృతురాలిది హత్యనా, మరైదేనా ఇప్పుడే ఏమి చెప్పలేమని పోలీసులు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని మేడిపల్లి ఏసీపీ బి.మోహన్‌కుమార్, చర్లపల్లి ఎస్‌హెచ్‌వో సుధాకర్ సందర్శించి వివరాలు అడిగితెలుసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.



మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## పుట్టింటికి వెళ్లి భార్య తిరిగి రాలేదని..
### ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన భర్త శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. రామంతాపూర్ గోకుల్‌నగర్‌కు చెందిన టి. అంబికకు ఒక కుమార్తె, ఇద్దరు కూమారులు శ్రీకాంత్, రాజు ఉన్నారు. శ్రీకాంత్ ( 24 ) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. మృతుడు శ్రీకాంత్‌కు నాలుగు సంవత్సరాల క్రితం భాగ్యశ్రీ అనే యువతితో వివాహం జరిగిందని తెలిపారు. మృతుడి తల్లి అంబికకు పోచారం డివిజన్ పరిధిలోని వెంకటాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు కాగా మృతుడు శ్రీకాంత్‌తో పాటు భార్య గత మూడు నెలలుగా నివాసం ఉంటున్నారు. కాగా మృతుడి భార్య గత 20 రోజులుగా పుట్టింటికియని వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో మృతుడు మానసిక వేదనకు గురి అయ్యి ఇంట్లోని తన గదిలో ఫ్యాన్‌కు నైలాన్‌తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తలుపులు ఎంతకు తీయకపోయడంతో సామల వెంకటేశ్ ప్రక్కప్లాట్‌లో ఉండే వ్యక్తి బలవంతంగా తలుపులు తెరిచిచూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించినట్లు తెలిపారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

### మూడో అంతస్తు నుంచి పడి చిన్నారి మృతి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 4, ప్రభాతవార్తః**

ఇంటి వద్ద ఆడుకుంటున్న ఏడాది చిన్నారి ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కిందపడటంతో మృతి చెందిన సంఘటన సనత్‌న గర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. రీటాదేవి కుటుంబం ఏడాది కాలంగా ఫతేనగర్ వాల్మీకినగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె చిన్న కుమార్తె హన్షిక(1) ఇంటి వద్ద ఆడు కుంటుండగా ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కిందపడింది. తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చిన్నారిని పరీక్షి ంచి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

# పదేళ్లు పాపాలు చేసి ఇప్పుడు ఆందోళనలా!

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** లక్ష్మీ మ్రదేవి ప్రాజెక్టు విషయంలో కుర్చీ వేసుకొని కూర్చుని పని చేయిస్తానన్న కేసీఆర్ మాట తప్పారని.. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక ప్రస్తుతం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిందని, రైతుల కలను సహకారం చేయబోతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకం పేర్కొన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాజెక్టును పూర్తి చేయడం ద్వారా షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గం పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వడమే కాకుండా, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజక వర్గాలకు కూడా అవసరం మేరకు నీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. షాద్‌నగర్ రైతులు కోరుకున్నట్లు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీ మ్రదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. నెల రోజుల కింద ఈ ప్రక్రియ పూర్తి చేసి డిస్ట్రిబ్యూటర్ కెనాల్కు ఎంత భూమి అవసరం గుర్తించి ప్రస్తుతం భూసేకరణ కోసం రంగం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. లక్ష్మీ మ్రదేవి పల్లి విషయంలో మోసం చేసింది ఎవరో.. న్యాయం చేసింది ఎవరో ప్రజలు, పత్రికా ప్రతినిధులు గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యారెంటీలను కూడా తమకున్న సమయంలోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. పదేళ్లపాటు ఏ పని చేయని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు వెయ్యి రోజుల పాలనపై ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

**దమ్ముంటే కేసీఆర్‌ను ప్రశ్నించండి..**

ఎన్నికలలో ఓడిపోయాక ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారు. అక్కడే నిద్రపోతున్నారు. అసెంబ్లీకి రావడం లేదు.. ప్రజాధనాన్ని తన జీతానికి, తనకు అందించే వసతులకు వృధా చేస్తున్నారు.. అలాంటి కెసిఆర్‌ను ఫామ్ హౌస్‌లో పండుకుంటే ఎలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ రైతుల కోసం పోరాటం చేసింది.. ప్రస్తుతం అధికారంలో ఉండి రైతులకు న్యాయం చేస్తోంది.. కానీ బీఆర్ఎస్ హయాంలో రైతులపై తుపాకీ గురి పెట్టింది ఎవరు.. రైతులను అరెస్టులు చేసి జైలు పాలు చేసింది ఎవరు.. గుర్తు తెచ్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో తప్పు చేస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయో కొండా సురేఖ ఉదంతం, చిన్నారెడ్డి ఉదంతం ద్వారా ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు కనీసం కెసిఆర్‌ను ప్రశ్నించే ధైర్యం కూడా చేయరని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, కొత్తూరు మున్సిపల్ నాయకులు సుదర్శన్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, జేపీసీ నాయకుడు టి.జి శ్రీనివాస్, కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి), మాజీ సర్పంచ్ శ్రీశైలం, మైనారిటీ నేత ఎండి ఇబ్రహిం, యాదగిరి యాదవ్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వెయ్యి రోజుల విజయోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ

## మూడుచింతలపల్లి కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

**శామీర్‌పేట, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి వెయ్యి రోజుల పూర్తిని పురస్కరించుకుని మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మూడుచింతలపల్లి మున్సిపాల్టీ కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మున్సిపాల్టీ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశంలు జెండాను ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. మున్సిపాల్టీ పరిధిలోని వివిధ గ్రామాలను కాంగ్రెస్ నాయకులు బైక్‌లపై ర్యాలీగ వెళుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు వివరించారు. బైక్ ర్యాలీ ముగించి పోతారం చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, మున్సిపాల్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం, మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ పార్టీ నాయకులు జి.మహేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్ పాపిరెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.జగన్నాథం, శశిధర్‌రెడ్డి, ఇర్రి రవీందర్‌రెడ్డి, బి.వెంకటేశ, భస్వారెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, వీరేశం, నర్సింలు, మహేశ్, బాలకృష్ణ, యాదగిరి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**..శామీర్‌పేట డివిజన్‌లో..**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిని పురస్కరించుకుని శామీర్‌పేట డివిజన్ పరిధిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శామీర్‌పేట డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు మహేశ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు అమరేందర్

## కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో పేదలకు ఊరట

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత వెయ్యిరోజులుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్గుతుండటంతో సంతృప్తి చెందుతున్నారని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ ఫకీర్‌టెక్యా తండాలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాడు వడ్త్యా ముడవత్‌కుమార్ నాయక్ ఆహ్వానం మేరకు మహేశ్‌గౌడ్ విచ్చేసి గృహప్రవేశం చేశారు. ఈసందర్భంగా లబ్దిదారు విచ్చేసిన నాయకులను శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఘణాపూర్ మాజీ సర్పంచ్ వేముల మమతగౌడ్, ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి కవాడి మాధవ్‌రెడ్డి, సహకార సంఘం మాజీ డైరెక్టర్ జవాజీ సత్తయ్య, మాజీ వార్డు సభ్యులు వడ్త్యా జయందర్‌నాయక్, వడ్త్యా చాందినాయక్, మెట్టు రమేశ్, డొంకెన శంకర్‌గౌడ్, మెడబోయిన జంగయ్య, నానావత్ సురేశ్‌నాయక్, ఇందిరమ్మ కమిటి సభ్యురాలు పైళ్ల లతరెడ్డి, జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి నానావత్

# ప్రజాపాలన కాదు దగాకోరుపాలన



మాట్లాడుతూన్న సబితా ఇంద్రారెడ్డి

### కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని బిఆర్ఎస్ నిరసన ర్యాలీలు

**మర్పల్లి సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** కాంగ్రెస్ వేయి రోజుల పాలనను నిరసిస్తూ ఆరు గ్యారెంటిలను 402 హామిలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం నాడు మండల కేంద్రంలో బిఆర్ ఎస్ నిరసన ర్యాలి నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాగ్రెస్ వేయి రోజులు గడసిన ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. మహిళలను కోటేశ్వర్లును చేస్తామని, మహాలక్ష్మి పథకం కిందా 2500 ఇస్తామని మహిళలను పూర్తిగా మోసం చేశారని అన్నరు. ఇచ్చిన ఏ ఒక్క హామి పూర్తిగా అమలు జరులేదన్నారు ప్రజాపాలన కాదు దగాకోరు పాలన సాగుతుందని అన్నారు.ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేకుండపోయిందని వచ్చే ఎన్నికల్లో కాగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చుప్తారని అన్నారు. మాజీ ఎమ్మెలే డాక్టర్ అనంద్ మాట్లాడుతూ ఉన్న పథకాల కోత తప్ప కొత్త పథకాల ఊసులేదన్నారు. యూరియా యాప్‌తో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారని యాప్‌ను తొలగించాలని అన్నారు.

వేయి రోజులు గడసి గ్రామాల్లో ఎక్కడ అబివృద్ధి జాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజల విశ్వాసం కోల్పోయిందని వచ్చె ఎన్నికల్లో ప్రలు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు.

ఈసమావేశంలో మండల పార్టీ అద్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజి జెడ్పిటీసి మధు,మాజి ఉపాద్యక్షులు మొహన్‌రెడ్డి, పార్టీ ప్రదాన కార్యదర్శి అశోక్, మండల యువజన నాయకులు మధుకర్, గ్రామ అద్యక్షులు గఫర్, సోయల్, ఖాజ పలు గ్రామాల నాయకులు సర్పంచ్‌లు పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

**అన్నోజిగూడలో వంటావార్పుతో నిరసన ..**

పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ వికలాంగుల కాలనీలో వంటా వార్పు కార్యక్రమం చేపట్టి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చామకూర భద్రారెడ్డి పాల్గొన్నారు. దాదాపు మూడేళ్ల గడిచినా అమలు చేయని హామీలను వచ్చే రెండేళ్లలో ఏవిధంగా నేరవేర్చుతారని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ బొడిగే బిక్షపతి గౌడ్, నీరుడి శ్రీనివాస్ ముదిరాజ్ ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిలదీస్తే బెదిరింపులా..**

**నందిగామ:** ఇందిరమ్మ రాజ్యంలో వెయ్యి రోజుల ప్రజా 6 గ్యారంటీలను ఆటకెక్కించారని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజుల్లో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిం చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవే ర్చడంలో విఫలమైందని నిరసిస్తూ నందిగామ తహసీల్దార్ కార్యాలయం ముందు వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమ స్యలు అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిల దీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది ఇందిరామరాజ్యమా..? పోలీస్ రాజ్యమా అని? ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, నాయకులు మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, బండోని గూడ సర్పంచ్ జట్ట కుమార్ ,చేగూరు మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎం విఠల్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మా రెడ్డి, నాయకులు మెక్కం రాజు, దార సురేష్, ఎర్రగారి స్వామి, జాంగారి రాములు తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్లలో మహిళల నిరసన**

**చేవెళ్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** అమలు కాని హామీలతో అబద్దాలతో అధికారంలోకి వచ్చి న సిఎం రేవంత్‌రెడ్డి గద్దె దించేందుకు మహి ళలు నడుం బీగించాలని మాజీ మంత్రి మహే శ్వరం శాసనసభ్యురాలు సబిత ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ళ ప్రభాకర్ ఆధ్వర్యంలో 1000 రోజుల విఫలన పాలనపై వంటా వార్పును నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగా శ్రీధర్ రెడ్డి సమ క్షంలో చేవెళ్ల నియోజకవర్గ కేంద్రమైన శంకర్పల్లి చౌరస్తా గుండం వద్ద మూడవ రోజు వంట వార్పు నిరసన కార్యక్రమంను నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలతో కలిసి రోడ్డుపైనే పొయ్యిలు పెద్ద ఎత్తున వంటావార్పు తో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్డుపై నృత్యాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ మాజీ ఇన్చార్జి దేశమల్ల ఆంజనేయులు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణరెడ్డి,రాష్ట్ర నాయకుడు విజయ ఆర్య క్షత్రియ,మాజీ ఎంపిపి విజయ భాస్కర్ రెడ్డి,మహిళా నాయకులు రాలు,పెద్దోళ్ల సుజాత మాజీ సర్పంచ్ (రామన్న గూడెం), తలారం సర్పంచ్ లక్ష్మి ప్రసన్న శేఖర్,మహిళా కౌన్సిలర్‌లు కూర్వ మంగమ్మ మల్లేష్ ,దప్పు సువర్ణ చందు, కౌన్సిలర్ మల్లేష్ మహిళా



నందిగామలో వంట వార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



చేవెళ్ళ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

నాయకురాలు తలారి స్వాతి యాదయ్య,దండు లత సత్యం, పెద్దోళ్ల విజయలక్ష్మి, నత్తి లావణ్య కృష్ణ రెడ్డి, రాధిక మల్లేష్, మిట్ట రంగ రెడ్డి, మల్లారెడ్డి,బ్యాగరి సుదర్శన్, పూలపల్లి పృథ్వి, రఘు, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాం ప్రసాద్, చాకలి గూడెం పాండు, ఉరడి నర్సింలు, మాధవ్ రెడ్డి, మాణిక్య రెడ్డి,రవికుమార్, మొహమ్మద్ జహెద్, మాజీ సర్పంచ్ జంగారెడ్డి, శేరీ శివ రెడ్డి, పెద్దోళ్ల గోపాల్, ఆలూరు మాజీ సర్పంచ్ నర్సింలు, కసిరే వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, ఉపేందర్ రెడ్డి, బ్యాగరి నర్సింలు, చాకలి కృష్ణ, తోట చంద్ర శేఖర్ బాలు, ముకుందం గౌడ్, రామకృష్ణ రెడ్డి, పెద్దోళ్ల శ్రీనివాస్, ఉద్యమకారుడు షేరీ రాజు, తదితర, పార్టీ నాయకులు, మహిళలు ,వృద్ధులు, వికలాంగులు బారి ఎత్తున పాల్గొ న్నారు.

**కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది**

**మొయినాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :**



మొయినాబాద్‌లో వంటావార్పులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



తూంకుంటలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు వంటవార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను గత మూడేళ్ల నుంచి మోసం చేస్తూ అరాచక పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెడుతూ పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందని ప్రజలకు వివరించేందుకు ఈ నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని దారెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సురంగల్ 14వ వార్డు కౌన్సిలర్ శ్రీధర్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, ముదిగొండ రవి యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, లీగల్ సెల్ అధ్యక్షుడు సురేందర్ గౌడ్, అంజిరెడ్డి అంజయ్య గౌడ్ కర్రోళ్ల భాస్కర్ షాబాద్ ప్రవీణ్ సుధాకర్ యాదవ్, కొత్తపల్లి రాఘవ రెడ్డి,కొంతం నాగేశ్వర్ రెడ్డి, దప్పు రాజు, కుమ్మరి రాము, చాకలి శ్రీను, చాకలి అరవింద్ తదితరులు ఉన్నారు.

**శామీర్‌పేట :** తూంకుంటలో బిఆర్ఎస్ నాయకులు వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంటలో పాత మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసింది ఏమి లేదని ఎన్నికలు ముందు ఇస్తామని చెప్పి హామీలు మరిచిందని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల బాకీ కార్డులను ప్రదర్శించి బిఆర్ఎస్ నాయకులు నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట పూర్వ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు, తూంకుంట మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, శామీర్‌పేట మాజీ ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, మండల మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, మాజీ కౌన్సిలర్లు పి.నర్సింగ్‌రావుగౌడ్, బి.రాజుయాదవ్, కె.సురేశ్, మాజీ సర్పంచు కట్టెల రవీందర్, బిఆర్ఎస్ నాయకులు పి.వీరారెడ్డి, రవికిరణ్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## ఇచ్చిన హామీలు అన్నీ అమల్లోకి వచ్చాయి

**పరిగి టౌన్ సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందించిందని ఎమ్మెల్యే డా. టి.రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడారు.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పరిగి నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మరో 2,500 ఇళ్లు మంజూరయ్యాయని, మొత్తం 6,000 ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు తీసుకు వచ్చేందుకు ముఖ్యమంత్రి కోరుతున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి, పరిగి నియోజకవర్గ రైతులకు సుమారు 300 కోట్ల రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. బైకులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి. కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట్ రాములు. సర్పంచులు. కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా ర్యాలీలు పాల్గొన్నారు.



# వినాయక .. ఆగయ

**నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు రెడీ**

**హైదరాబాద్, సెప్టెంబరు 4,ప్రభాతవార్త:**

వినాయక నవరాత్ర్సవాల నేపథ్యంలో నగరంలో గణపతి వవిగ్రహాల తయారీ కొనగోళ్లు ఊపందు కున్నాయి. ఈఏడాది వినాయక మండపాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈనెల 14న వినాయకచవితికాగా ఇప్పటికే గణపతి విగ్రహాల కొనుగోలు ప్రారంభించారు. దీంతో బస్తీలు, గల్లీలల్లో , గణేష్‌మండావల ఏర్పాట్లలో నిమగ్నమైపోయారు. ఇప్పటికే మండపాల నిర్వా హకులు విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి రిజర్వ్ చేసు కోగా మరికొందరు తీసుకెళ్లేపనిలో పడ్డారు. గ్రేట ర్‌హైదరాబాద్‌లోలో దాదాపు 3లక్షల పెద్దవిగ్ర హాలు తయారు చేస్తున్నారు. ధూల్‌పేట్ ,ఉప్ప ల్, నాగోల్, ఆటోనగర్, పెద్దఅంబర్‌పేట్ ,మి యాపూర్, తదితర ప్రాంతాల్లో విగ్రహాల తయా రీ ఖార్ఖానాలు దాదాపు 500వరకు ఉంటాయి. అమ్మకాలతో ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలమంది ఉపాధి పొందుతుంటారు. పెద్దవిగ్రహాలకు స్థాని కంగా చేస్తుండగా, చిన్నవి షోలాపూర్ నుంచి బల్క్‌గా తీసకువచ్చి హోల్‌సేల్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. ఇతర రాష్ట్రాల వాళ్లు సైతం ఆర్డర్ చేసి కొనుగోలు చేస్తున్నట్లు దూల్‌పేట్ వ్యాపారులు తెలుపుతున్నారు.

**ఇంకా పివోపితోనే తయారీ ..**

పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పివోపి)తో తయారు చేసే విగ్రహాలతో పోలిస్తే మట్టితో చేసినవవి మేలని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నేండ్లుగా మట్టిగణపతుల పైనా జనాల్లో అవగాహన పెరిగింది. అయితే వీటితయారీలో ఇబ్బందులు ఉన్నాయని నిర్వా హకులు చెబుతున్నారు. ఎక్కవ కాలం నిల్వ ఉంచడం సాధ్యం కాదని ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో అయితే సులభంగా తయారు చేయొచ్చునని చెబుతున్నారు. అదేమట్టితో అయితే చేతులో నొక్కుతూ చేయాల్సి ఉంటుందని దీంతో మట్టి విగ్రహాల తయారీకి కార్మికులు ఇష్టపడటం లేదని పేర్కొంటున్నారు.

ఎనిమిది ఫీట్ల పిఒపి విగ్రహా 20వేలు ఉంటే ..మట్టి విగ్రహం ధర 40వేల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే ముడి సరుకుల ధరలు, కూలీల రేట్లు పెరగడ టంతో విగ్రహాల రేట్లు పెంచక తప్పడం లేదని తయారీ దారులు పేర్కొంటున్నారు.

## వెయ్యి కిలోల పూలతో మహాభిషేకం

**అత్తాపూర్ సెప్టెంబరు4,ప్రభాతవార్త :**

అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.శ్రీకృష్ణుడికి 1,000 కిలోల పుష్పాలతో మహా అభిషేకం నిర్వహించడంతో పాటు, ఆలయ ప్రాంగణాన్ని సుమారు 10,000 కిలోల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వృందావనం నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన శృంగార వస్త్రాలతో స్వామివారికి విశేష అలంకరణ చేశారు.దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆస్ట్రేలియా, మాయాపూర్ నుంచి కూడా భక్తులు వేడుకలకు తరలివచ్చారు. సుమారు లక్ష మంది భక్తులకు దర్శన అవకాశం కల్పించడంతో పాటు, దాదాపు లక్ష మందికి మహా అన్నదానం నిర్వహిస్తున్నారు.భక్తుల హరినామ సంకీర్తనలు, ప్రత్యేక పూజలు, పుష్పాలంకరణలతో అత్తాపూర్ ఇస్కాన్ ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**జన్మాష్టమి వేడుకలో పాల్గొన్న మంత్రులు ,ఎంపి**

అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఇతర నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ...భగవంతుడు శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పవిత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. శ్రీకృష్ణుడి జీవితం మనందరికీ ధైర్యం, ధర్మం, జ్ఞానం, సమయస్ఫూర్తి, కర్తవ్యనిష్ఠకు ఆదర్శంగా నిలుస్తుంది.అధర్మం పెరిగినప్పుడు ధర్మాన్ని కాపాడేందుకు భగవంతుడు శ్రీకృష్ణుడు అవతరించారని మన పురాణాలు చెబుతున్నాయి.ప్రస్తుత సమాజంలో యువత శ్రీకృష్ణుడి బోధనలను ఆదర్శంగా తీసుకుని విద్య, ఉద్యోగం, వ్యాపారం, ప్రజాసేవ వంటి అన్ని రంగాల్లో ముందుకు సాగాలి. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, భావిత రాలకు అందించే బాధ్యత మనందరిపై ఉంది.శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రజల్లో ఐక్యత, భక్తి, సోదరభావాన్ని పెంపొందించాలని రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో భక్తులు,వివిధ పార్టీల స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## క్యాష్ కొట్టేశాడు.. పోలీసులకు చిక్కాడు!

**-రూ.24.49 లక్షల నగదు స్వాధీనం..**

**పాత ఉద్యోగే నిందితుడు**

**అత్తాపూర్ సెప్టెంబరు4,ప్రభాతవార్త :**

కాటేదాన్‌లోని ప్రముఖ బిస్కట్ కంపెనీలో జరిగిన భారీ నగదు చోరీ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వేగంగా ఛేదించారు. కేసు నమోదైన కొద్ది రోజుల్లోనే సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.24,49,500 నగదుతో పాటు రెడ్‌మి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకు న్నారు.డిసిపి శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కాటేదాన్‌లోని హర్ష్ బేకర్స్ కంపెనీ క్యాషియర్ గడ్డం కురుమూర్తి ఆగస్టు 31న రాత్రి రోజువారీ కలెక్షన్‌కు సంబంధించిన సుమారు రూ.24-25 లక్షల నగదును కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరిచారు. అనంతరం కార్యాలయానికి తాళం వేసి, తాళాలను సెక్యూరిటీ గార్డుకు అప్పగించి వెళ్లారు.సెప్టెంబర్ 1న ఉదయం ఉద్యోగులు కార్యాలయానికి చేరుకోగా తలుపులు, బీరువా, లాకర్ పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. లాకర్‌లోని భారీ మొత్తంలో నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

**సీసీ కెమెరాలతో నిందితుడి గుట్టురట్టు**

పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారా లను విశ్లేషించడంతో పాటు పలువురు వ్యక్తులను విచారించి నిందితుడి ఆచూకీని గుర్తించారు.దర్యాప్తులో అనిల్ నాగోరావు కాంబ్లే (28) ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. లేబర్/హెల్పర్‌గా పనిచేస్తున్న అతడు గతంలో ఇదే హర్ష్ బేకర్స్ కంపెనీలో పనిచేసిన పాత ఉద్యోగిగా తేలింది. కంపెనీపై ఉన్న పరిచయం, నగదు భద్రపరిచే విధానంపై అవగాహనను ఉపయోగించుకుని చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి ఇంట్లో దాచి ఉంచిన రూ.24,49,500 నగదు, ఒక రెడ్‌మి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.వ్యాపారులకు పోలీసుల సూచనలునగదు లావాదేవీలు అధికంగా జరిగే వ్యాపార సంస్థల యజమానులు ఉద్యోగులను నియమించుకునే ముందు వారి నేపథ్యాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని పోలీసులు సూచించారు.

## పోలీసులకు నిత్యస్ఫూర్తి ఉమేశ్‌చంద్ర : సిపి సజ్జనార్

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:**

దివంగత ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర నీతి, నిజాయితీ, ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలిచారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అన్నారు. పోలీసులకు ఆయన నిత్యస్ఫూర్తి అని కొనియాడారు. ఉమేశ్‌చంద్ర 27వ వర్ధంతి సందర్భంగా ఎస్సార్ నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి సజ్జనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమేష్‌చంద్ర చేసిన సేవలు, త్యాగాలను స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో ఉమేశ్‌చంద్ర కీలక పాత్ర పోషించారని సజ్జనార్ తెలిపారు. ఆయన చూపిన కర్తవ్యనిష్ఠ, ఆదర్శాల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజీపీ (ఆపరేషన్స్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్) డాక్టర్ అనిల్‌కుమార్, ఉమేశ్‌చంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అంతకముందు ఉమేష్ చంద్ర అభిమానులు సైతం ఆయనకు నివాళులు అర్పించి పూలమాలలు సమర్పించారు.



బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం మేళ్ల గూడ గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీ తండాలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ఆలయానికి శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని అందజేసి విగ్రహ దాతగా నిలిచారు. దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందజేసిన ఇన్ముల్‌నర్వ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ల యాదగిరి, సర్పంచులు మంగ రవి నాయక్, లలిత గోపాల్ నాయక్, వేణుగోపాల్ చారి, మాజీ సర్పంచులు లచ్చు నాయక్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ నాయక్, జగన్, మురళీధర్ రెడ్డి, ఎన్ఆర్ఐ నాయకులు గోగు వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



గ్రామదేవతలకు విరాళం అందజేసిన దేపల్లె బ్రదర్స్

## గ్రామదేవతల ఆలయానికి రూ.51 వేల విరాళం

**నందిగామ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** నందిగామ మండ్నల అంతిరెడ్డి గూడ గ్రామపంచాయతీ పరిధిలోని జంగోని గూడలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, మైసమ్మ దేవతల గుడుల నిర్మాణాలకు నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, వార్డు సభ్యురాలు దీపిక శ్రీశైలం గౌడ్‌లు శుక్రవారం రూ.51,100 విరాళంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యకమం లో నందిగామ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జంగ నర్సింహ, ఉప సర్పంచ్ మల్లేష్, వార్డ్ సభ్యులు దేపల్లి శేఖర్ గౌడ్, అంజి యా దవ్, పీఏసీఎస్ డైరెక్టర్స్ మెక్కొండ యాదయ్య, రమేష్, రాజేందర్ నర్సింహ, ప్రణయ్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి ప్రారంభోత్సవం

**నందిగామ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** నందిగామ మండలం మేకగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సంఫీగూడలో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు వడ్డే మహేశ్వరి రమేష్ దంపుతుల నూతన గృహప్రవేశాన్ని శుక్రవారం నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సుక్య నాయక్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోకొత్తగా నియమితులైన మేకగూడ పిఎసిఎస్ ఛైర్మన్ అంబటి ప్రభాకర్, వైస్ ఛైర్మన్ విగ్నేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు మామిళ్ళ పల్లి శ్రీను, రాములు, నందిగామ సర్పంచ్, జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, మాజి సర్పంచ్ పాండురంగా రెడ్డి, వార్డు సభ్యులు రాజు, హనీఫ్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డా నర్సింహ మరిపల్లి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మామిళ్ళ పల్లి నర్సింహ, పర్వతలు, మల్లేష్, మాజి ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు రఘపతి రెడ్డి, గంటెల సత్తయ్య, యాదయ్య, సత్యనారాయణ రెడ్డి, మరిపల్లి యాదయ్య, కుర్వ సత్యం, రాజు నాయక్, చంద్రయ్య, సాయి రెడ్డి, తిరుపతి రెడ్డి, రమేష్, మాధవ్, మధు గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్‌నగర్‌లో భారీ చోరీ

### -5 తులాల బంగారం, కిలోన్నర వెండి అపహరణ

**యాలాల, సెప్టెంబరు 4,ప్రభాతవార్త :** ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు దోపిడి చేశారు.ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి బారువాలో ఉన్న 5 తులాల బంగారం, కిలోన్నర వెండిని అపహరించుకుపోయారు.ఈ సంఘటన యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...కోకట్ పరిధిలోని ముచ్చర్ల వెంకటేషం అనే వ్యక్తి ఈ నెల రెండవ తేదీన పనిమీద కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్ట్రం సేడం వెళ్లారు.3వ తేదీన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న ఐదుతులాల బంగారం, కిలోన్నర వెండిని దోచుకొని పరారైయ్యారు. బాధితులని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దోపిడి దొంగలు భీభత్సం చేశారు.

## అనాధ యువతి వివాహానికి దాతల చేయూత

**తలకొండపల్లి,సెప్టెంబరు4, ప్రభాతవార్త :** తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మిగిలిన యువతి వివాహానికి పలువురు దాతలు చేయూతనిచ్చారు. మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన లక్నమోని పూజ పెండ్లి కోసం లక్షీ     మ్మనరసింహస్వామి దేవాలయ సన్నిధిలో పెళ్లి మండపాన్ని ఉచితంగా ఇచ్చారు. విందు భోజనం ఖర్చుల నిమిత్తం రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహకారం అందించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, మాజీ అధ్యక్షుడు డోకూర్ ప్రభాకర్ రెడ్డి 10 వేలు, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ రూ.5,516 చొప్పున విరాళాలు అందించి దాదృత్వాన్ని చాటుకున్నారు. పూజ తల్లిదండ్రులు 12 ఏళ్ల క్రితమే మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.10 వేల నగదు సాయం అందజేశారు. అనాధ యువతి వివాహాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పలువురు దాతలు ముందుకొచ్చి అండగా నిలవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సిపిఎం నేత చంద్రయ్య అరెస్ట్

**దుద్యాల్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం హకీంపేట సమీపంలో కొనసాగుతున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో శుక్రవారం సీపీఎం నేత బుస్సు చంద్రయ్యను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమ అరెస్టులు ఉండవని ప్రకటించినప్పటికీ, సీఎం వచ్చిన ప్రతిసారీ అరెస్టులు చేయడం తగదని చంద్రయ్య పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదన్నారు.

## శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష

**సైఫాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** బ్రాహ్మణ సంక్షేమ పరిష త్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆవేదనతో శుక్రవారం గన్‌పార్కులోని అమర వీరుల స్తూ  పం వద్ద తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల జెఏసి ఛైర్మన్ యజ్ఞం పవన్‌కుమార్‌శర్మ ఆత్మహత్య యత్నం చేశారు. పెట్రోల్ బాటిల్‌తో అగ్గిపెట్ట తీసుకుని ఆత్మహత్య యత్నం చేసిన ఆయనను పోలీసులు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, బ్రాహ్మణులు అడ్డుపడి నివారించడం జరిగింది. వారు ఆత్మహత్య పరిష్కార మార్గం కాదని, బతికుండి ఏదైనా సాధించు కోవాలని శర్మకు సూచించారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడుతూ ఒకటి, రెండు రోజుల ఈ సమస్యకు పరిష్కారం లభించేందుకు కృషి చేస్తున్నా నని చెప్పారు. బలిదానం చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. సురభి వాణిదేవి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం పాటుపడేవారు, సర్వజనో సుఖినోభవంత్ అని దీవించే బ్రాహ్మణులు బలిదానాలకు పాల్పడటం మంచిది కాదని, కలిసి కట్టుగా సమస్యను పరిష్కారించుకుందామన్నారు.

# ఉపాధ్యాయుల మానసిక ధైర్యాన్ని దెబ్బతీయకండి

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** ప్రజా, విద్యార్థి సంఘాల ముసుగులో కొందరు ప్రభుత్వంపై కక్షగట్టి వాస్తవ పరిస్థితులను పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వ విద్యా విధానాన్ని అవమానపరిచే విధంగా, అప్రతిష్ట పాలు చేస్తూ కొందరు కుట్రలు చేస్తున్నారని వీటిని కొనసాగనివ్వమని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ, ఎస్సీ సెల్ నాయకులు ధ్వజమెత్తారు. ఇటీవల కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మృతి చెందిన గిరిజన విద్యార్థిని ముదావత్ అశ్విని మృతి బాధాకరమని ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేత జాంగారి రవి,గిరిజన నేతలు సర్పంచులు చందు నాయక్, ఆర్ బాబు నాయక్, కేశంపేట మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రుప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేతలు సింగపాగ జంగయ్య, జాంగారి జంగయ్య, గిరిబాబు, తదితర బృందం కమ్మదనం రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శారద తదితర టీచర్స్‌తో కలిసి వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకోకుండ సంబంధంలేని ఇంగ్లిష్ లెక్చరర్ శ్యామలను సస్పెండ్ చేయడం బాధాకరం అని శ్రీను నాయక్ అన్నారు. ఉపాధ్యాయుల మానసిక ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా లంబాడి హక్కుల పోరాట సమితి, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, నాయకులు ఓ రాజకీయ పార్టీకి వంత పాడే విధంగా ఆందోళనలు నిర్వహించి వాస్తవాలను



మాట్లాడుతున్న ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్

పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సెల్ నాయకులు జాంగారి రవి, గిరిజన నేతలు ఉప్పారిగడ్డ, వెల్ జర్ల గ్రామ సర్పంచులు చందు నాయక్, ఆర్ బాబు నాయక్ , కేషంపేట్ మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రుప్ల నాయక్ , కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేతలు సింగపాగా జంగయ్య, మండల కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, భీమారం మాజీ సర్పంచ్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నా కుమార్తె ఆత్మహత్యకు వేధింపులే కారణం? : అశ్విని తండ్రి ఫిర్యాదు

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** కమ్మదనం గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 18 ఏళ్ల గిరిజన విద్యార్థిని ముదావత్ అశ్విని మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అశ్విని మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ ఆమె తండ్రి ముదావత్ చందర్ షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 2న సాయంత్రం సుమారు 5:09 గంటలకు అశ్విని క్లాస్ టీచర్ సద్గుణ తనకు ఫోన్ చేసి, తన కుమార్తె పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సమాచారం ఇచ్చినట్లు తండ్రి తెలిపారు. దీంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లగా అశ్విని అక్కడ కనిపించలేదని, ఆరా తీయగా ఆమెను ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గురుకుల వసతి గృహంలోని గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని అశ్విని మృతి చెందినట్లు కళాశాల సిబ్బంది తనకు తెలిపారని తండ్రి పేర్కొన్నారు. అలాగే హాస్టల్ హెచ్ఓ నర్స్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని ఫిర్యాదులో తెలిపారు. మరోవైపు గతంలో తమ గ్రామానికి చెందిన ఆర్. రమేష్ తన కుమార్తెను వేధించి, బెదిరించాడని, దీనిపై జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు అశ్విని తండ్రి వెల్లడించారు. కుమార్తె మృతిపై తనకు అనేక అనుమానాలు ఉన్నాయని, సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తండ్రి ఫిర్యాదుతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 758/2026, బీ.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసినట్లు రికార్డులో ఉంది. ఎస్ఐ రాథ్లావత్ శ్రీకాంత్ నాయక్ కేసు దర్యాప్తును చేపట్టారు. అశ్విని మృతికి దారితీసిన పరిస్థితులు, ఘటనకు ముందు చోటుచేసుకున్న పరిణామాలు, ఫిర్యాదులో పేర్కొన్న అనుమానాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**గురుకుల పాఠశాల సిబ్బందికి బెదరింపులు?**

ఓ వైపు లంబాడి హక్కుల పోరాట సమితి మరోవైపు ఎస్ఎఫ్ఐ, ఇంకోవైపు ఏబీవీపీ తదితర సంఘాల నాయకులు విద్యార్థిని అశ్విని వ్యవహారంలో గురుకుల అధ్యాపకులదే తప్పు అంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. దీంతో ఇంగ్లీష్ లెక్చరర్ శ్యామలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అశ్విని ఆత్మహత్యకు గల కారణాలు వేరేగా ఉన్నప్పటికీ ఓవైపు విద్యార్థి సంఘాలు మరోవైపు కుల సంఘం ఒత్తిడి మేరకు ఆ శాఖ అధికారులు ఎటు తెలుసుకోకుండానే శ్యామలపై వేటు వేశారు. తీరా విద్యార్థిని తండ్రి మాత్రం తన కూతురు చావుకు జడ్చర్ల ప్రాంతానికి చెందిన తమ దగ్గర బంధువు ఆర్ రమేష్ వేధింపులే కారణమని షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఇప్పుడు కథ అడ్డం తిరిగింది.

రెండు రోజులుగా గురుకుల సిబ్బంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఓవైపు సంఘాల బెదిరింపులు మరోవైపు భయాందోళనలు వారిని చుట్టుముట్టడంతో ఊపిరి పీల్చుకోలేకపోయారు. ఇందులో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నిన్న ఆందోళనల అనంతరం గురుకుల పాఠశాల నుండి బల వంతంగా 2 లక్షల రూపాయలు మృతురాలి కుటుంబానికి టీచర్ల వద్ద డబ్బులు పోగేసి ఇచ్చినట్లు సమాచారం. లేకపోతే శవాన్ని గురుకులంలో వేస్తామని బెదిరింపులకు దిగడంతో కొందరు ఈ చర్యలు పాల్పడినట్లు ప్రాథమికంగా సమాచారం అందుతోంది.

# ఆధారాలుంటే బయటపెట్టండి..

### ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం తగదు..

### కాంగ్రెస్ నేతల ఆందోళన

**తాండూరు, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు తగవని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజతో పాటు కాంగ్రెస్ నేతలు అన్నారు. ఎమ్మెల్యేపై అవినీతి ఆధారాలు ఉంటే బయటపెట్టాలని.. బహిరంగ చర్చకు ఎమ్మెల్యే అవసరం లేదని.. ఎమ్మెల్యే తరుపున చర్చకు మేము సిద్ధంగా ఉన్నామంటూ ప్రతి సవాల్ విసిరారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజతో పాటు నేతలు మీడియాతో మాట్లాడారు.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రూ.3500కోట్లతో తాండూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తాండూరు ప్రజలకు తాగునీటి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కష్టాలను తీర్చేందుకు రూ.110కోట్లతో తాగు నీటి పథకాన్ని తీసుకురావడం పాపమా అంటూ ప్రశ్నించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్‌కు ఎమ్మెల్యేను విమ ర్శించే స్థాయి లేదని.. ఆయన ప్యాకేజీ లీలలు అందరికి తెలుసని అన్నారు. ఎమ్మెల్యే మనో హర్‌రెడ్డిపై దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నిస్తున్నారని మండి పడ్డారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గత కొన్ని సంవత్సరాల నుండి రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నారని గుర్తు చేశారు. మనోహర్‌రెడ్డిపై మరోసారి నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విత్తన మేళా ప్రారంభం

**తలకొండపల్లి జూన్ 23 ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం నాడు ప్రభుత్వం విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విత్తనమేల కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు రమాదేవి అమంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవులు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో సందర్భంగా రైతులకు సరిపోను వర్షాలు కురవక పోవడంతో రైతులు అధికారులు చూయించిన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఆరు తాటి పంటలకు ప్రాముఖ్యత ఇచ్చి వేసుకోవాలన్నారు. నానో యూరియా మరియు నానో డిఏపి లను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం రైతులు వరి పంటలో ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని జులై 15 తర్వాత నాలు పోసుకోవాలని వారు సూచించారు. వరికి బదులుగా ఆరుతడి పంటలైన కంది జొన్న పెసర మినిమం లాంటి పంటలను రైతులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, తలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, సర్పంచులు శ్రీను శంకర్ నాయక్, తోపాటు ఆయా గ్రామాల మాజీ సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దండోరాలో యువత భాగస్వాములు కావాలి

**శామీర్‌పేట, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** మాదిగల హక్కుల కోసం పోరాడుతున్న ఎంఆర్‌పిఎస్ దండోరా ఉద్యమంలో మాదిగ యువత భాగస్వాములు కావాలని, సంస్థాగతంగా ఎంఆర్‌పిఎస్ దండోరాను మరింత బలోపేతం చేయటానికి కృషి జరుగుతుందని ఎంఆర్‌పిఎస్ జాతీయ కళా మండలి అధ్యక్షులు ఎన్.వై. అశోక్ పేర్కొన్నారు. శామీర్‌పేట గ్రామ ఎంఆర్‌పిఎస్ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా ఎంఆర్‌పిఎస్ సమావేశం జరిగింది. ఎంఆర్‌పిఎస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయటానికి మాదిగ యువకులతో సమావేశంను ఏర్పాటు చేసి శామీర్‌పేట గ్రామ ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై. అశోక్ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం ఎంఆర్‌పిఎస్ పోరాటాలు చేస్తుందని అన్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎంఆర్‌పిఎస్‌ను సంస్థాగతంగా మరింత బలోపేతం చేయటానికి కృషి జరుగుతుందని ఆయన తెలిపారు. దీనిలో ఆయనతో పాటు ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు అద్రాస్‌పల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆ తరువాత శామీర్‌పేట గ్రామ ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ కార్యవర్గంను ఎన్నుకున్నారు. శామీర్‌పేట గ్రామ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులుగా కె.వెంకటేశ, అధికార ప్రతినిధిగా ఎం.కిషన్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్, ఎన్.మధు, ఉపాధ్యక్షులుగా డి.నితిన్, మదు, ఎం.రాకేశ్, కోశాదికారిగ ఎం.విజయ్, శ్రీకాంత్, ఎన్.మహేశ్, ఎం.ప్రసాద్, నరేశ్, వినయ్, సాయికుమార్, శ్రీను, బాలనర్సింహ్మ, భాస్కర్‌లు ఎన్నికయ్యారు.



వెంకటేశకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు అశోక్

## నేడు హనుమాన్ చాలీసా పారాయణం

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో శనివారం హనుమాన్ చాలీసాపారాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చౌదరిగూడ హనుమాన్ చాలీసాపారాయణ సేవ మితి సభ్యులు తెలిపారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో 108 మందితో సాముహిక హనుమాన్ చాలీసా కార్యక్రమం ప్రారంభం అవుతుందని వారు పెర్కొన్నారు.

## ఆపదలో ఉన్న వాళ్లకి ఆపన్నహస్తం

### అందరివాడుగా బూర్గుపల్లి సర్పంచ్ సొంత ఖర్చుతో సేవా కార్యక్రమాలు

**మోమిన్‌పేట, సెప్టెంబరు 4. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్‌రెడ్డి సొంత ఖర్చులతో పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతుంటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ప్రభాతవార్తతో మాట్లా డుతు రూ.3, లక్షల సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలోని విద్యార్థులకు కోసం (స్పోర్ట్స్ డ్రెస్సులు) ఆటవస్తువులు, ఏక రూపదుస్తులు బూట్లు అందజేశానన్నారు. గ్రామంలో వివాహం జరిగే ప్రతి కుటుంబాలకు పెళ్లి కానుకగా రూ.5 వేలు, కుటుంబంలో ఎవరైనా మృతి చెందినప్పుడు రూ.5 వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. శిశువులు జన్మించిన కుటుంబాలకు బేబీ కిట్లు అందిస్తూ తనవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణం కావడంతోపాటు రూ. 10 లక్షలలతో డ్వాక్రా భవనం పనులు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో బూరుగుపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సాధ్యమైనంత త్వరగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి తెలిపారు.



సర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి



వినాయక చవితి నిర్వహకుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

## గణేష్ ఉత్సవాలలో నిబంధనలు పాటించండి

**చేవెళ్ల, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** గణేష్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని చేవెళ్ల సిఐ నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అట్లాస్ ఫంక్షన్‌హల్‌లో వినాయక చవితి నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సిఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తుల రద్దీ, గాలి, భారీ వర్షం కారణంగా కూలిపోకుండా తాత్కాలిక మండపాన్ని నాణ్యమైన మెటీరియల్ సిద్ధం చేయాలన్నారు. పైకప్పును టార్పాలిన్లతో కప్పాలని, మండపంలోకి జంతువులు ప్రవేశించే అవకాశం ఉండదని అన్నారు. మండపంలో ఎలక్ట్రికల్ ఫిట్టింగ్ల కోసం మంచి నాణ్య మైన వైర్‌లను ఉపయోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎస్ఐలు వెంకటేష్, రవీందర్‌నాయక్,బి.శిరిష, వనం శిరిష పాల్గొన్నారు.

## మాదిగ జాతి భవిష్యత్తు కోసం అందరం ఏకం కావాలి

**నార్సింగి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** మాదిగ జాతి భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ విద్యావంతులైన యువకులు జాతి నాయకత్వ బాధ్యతలు తీసుకోవాలని, ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాల నుంచి ప్రజల సమస్యలతో పాటు మాదిగల వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు, ధర్నాలు, దీక్షలు చేసి విజయం సాధించామన్నారు. తాజా పరిణామాలు, భవిష్యత్తు ఉద్యమ లక్ష్యాలు, నాయకుల కర్తవ్యం వంటి అంశాలపై కూలంకుశంగా చర్చిం చుకున్నారు. అనంతరం గండిపేట మండల నూతన కమిటీని ఎన్నుకు న్నారు. నూతన అధ్యక్షులుగా రామేశ్వరం దాసు మాదిగ, అధికార ప్రతినిధిగా ఏర్పుల నర్సింగ్‌రావ్ మాదిగ, ఉపాధ్యక్షులు రేవోల రజనీ కాంత్ మాదిగ, ఎంఎస్‌పి అధ్యక్షులుగా బలరాం మాదిగ తదితరులను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బాబు మాదిగ, పెద్దపులి కృష్ణ మాదిగ, నాయకులు గోపాల్, నరేందర్, బిక్షపతి, మల్లప్ప, యాదవరావు తదతరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను పటిష్టం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలి

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజలకు వివరిస్తూ కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ పార్టీని మరింత పటిష్టం చేసేందు కు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న, కార్పోరేషన్ చైర్మన్లు మన్నెక్రిషాంక్,గజ్జల నాగేశ్‌లు తెలిపారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు నిరసనగా శుక్రవారం కంటోన్మెంట్ 3వ వార్డులోని డ్రిమ్‌లాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగట్టారు. కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, దివ్యాంగుల పెన్ష న్, రైతు బంధు వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కారోబార్ మండల కమిటీ సభ్యుల బృందం

## కారోబార్ల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** గ్రామ కారోబార్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష     ్యంగా ఫరూక్‌నగర్ మండల గ్రామ కారోబార్ల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. శుక్ర వారం షాద్‌నగర్ పట్టణంలోని బ్లాక్ ఆఫీస్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. త్వరలో షాద్‌నగర్ డివిజన్ పరిధి లోని ప్రతి మండలంలో కారోబార్ల సమావేశాలు నిర్వహించి ఆయా మండలాలకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని మండలాల్లో కమిటీల ఏర్పాటు పూర్తయిన అనంతరం డివిజన్ స్థాయి కమిటీని ఎన్నుకుంటామని పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా గంట్లవెల్లి కర్రోల వీరేందర్, ఉపాధ్యక్షులు: భీమారం కమ్మరి నరేష్ చారి, మొగలిగిద్ద నర్సింలు, దేవునిపల్లి నరేష్ గౌడ్, కృష్ణయ్య, కిషన్‌నగర్, చింతగూడెం సురేష్, కంసాన్‌పల్లి నరసింహులు, కమ్మదనం కుమార్, సరిత బుచ్చిగూడెం, శ్రీశైలం దుస్కల్ తదితరులు ఎన్నికయ్యారు.

## ఆశీర్వాదం మృతి బిఆర్ఎస్‌కు తీరని లోటు

**షాద్‌నగర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణం రాఘవేంద్ర కాలనీకి చెందిన ఆశీర్వాదం హఠాత్తుగా మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ యువనాయకులు వై. మురళీకృష్ణ యాదవ్ అన్నారు. విషయం తెలుసుకున్న ఆయన ఆశీర్వాదం స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ కౌన్సిలర్లు చెట్ల నరసింహ, జూపల్లి శంకర్, నాయకులు అశోక్ యాదవ్, గణేష్, రాకేష్ తదితరులు ఉన్నారు.

## అగ్నిప్రమాదంలో వ్యక్తి మృతి

**యాలాల, సెప్టెంబరు 4,ప్రభాతవార్త :** ప్రమాద వశాత్తు ఓ వ్యక్తి నిప్పంటుకొని మృతి చెందాడు.ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముద్దాయిపేట గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముద్దాయిపేట గ్రామానికి చెందిన పూలగోని రాజు(40)అనే యువకుడు కిరాణాషాప్‌లో పెట్రోల్‌ను డబ్బాలో తీసుకొని ఇంట్లోనే ఉన్న కరెంటు బోర్డు స్విచ్ ఆన్ చేయడానికి యత్నించాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి శరీరం మొత్తం కాలిపోయింది. కుటుంబీకులు బాధితున్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసత్రికి తరలించిగా శుక్రవారం మృతి చెందాడని తెలిపారు.మృతుని కుటీంబికుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**కుల్కచర్ల,సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కావాలని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లదరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ హస్పిటల్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతల్లో ప్రజలకు వైద్యం అందుబాలో ఉండటం ఎంతో అవసరమన్నారు. చిన్నచిన్న ఆనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థిలి లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. హస్పిటల్ నిర్వాహకులు రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాక్షించారు. తులసి హస్పిటల్ ద్వారా పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అయా పార్టీలకు చెందిన నాయకులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఓటరు జాబితా సవరణ

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో గల ఓటర్లు శనివారం, ఆదివారం రోజుల్లో తమ ఓటరు జాబితాను చూసుకోవాలని తహాపీల్దారు జగదీశ్వర్, ఎంపిడిఓ పుష్పలత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం సర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూతుయందు బిఎల్‌ఓలు ముసయిదా ఓటర్ల జాబితా, ఫామ్ 6,7,8 లతో అందుబాటులో ఉంటారు. ఓటర్లందరూ ముసాయిదా జాబితాలో తమ పేర్లు సరిగా ఉన్నవి లేనివి చూసుకకుని ఒకవేళ ఏమైనా తప్పులు ఉంటే ఫారం 8ని ధరకాస్తు చేసుకోవాలని కోరారు. అలాగె కొత్త ఓటర్లు ఫారం 6తో పాటు డిక్లరేషన్‌ను బిఎల్‌ఓ లకు రెండు రోజులు పోలింగ్ బూతుల వద్ద అందజేయాలని పెర్కొన్నారు.

## రోడ్డు పనులు వేగవంతం చేయాలి

**షాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ మాచన్పల్లి గ్రామల మధ్య బీటీ రోడ్డు పనులను జిల్లా ఈఈ చంద్రశేఖర్ గ్రామ సర్పంచ్ పామెన నర్సింహులుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రోడ్డు మధ్యలో కల్వర్టుల పనులు జరుగుతున్నందున వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పోతుగల్ గ్రామం వద్ద సిసి రోడ్డు వేయాలని ఈఈ చంద్రశేఖరకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విజయ్కుమార్, ఏఈ ఆశాజ్యోతి, వర్క్ ఇన్స్పెక్టర్ శివ, గ్రామస్తులు చెన్నయ్య.. పామైన రాజు, నేరెట్ల రాజు, నరేందర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా రాజశ్యామలా యాగం

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** వెంగళ్‌రావుగనర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలో ఉన్న శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానంలో భవానిశంకర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచే రాధా కృష్ణ పూజోత్సవంతో పాటు రాజశ్యామాలా హోమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల ఆరో తేదీ వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్



**జుబ్లీహిల్స్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ఖైరతా బాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపిన దానం నాగేందర్.. ఆయ నకు ఆరోగ్యం, సంతోషం, తెలంగా ణ ప్రజలకు మరింతకాలం సేవలం దించే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. గవర్నర్‌తో దానం నాగేందర్ స్నేహపూర్వకంగా, సమావేశమయ్యారు.

## దోమల బెడదను నివారించండి



జిహెచ్ఎంసి అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న మునకుంట్ల ఆనంద్ కుమార్‌గౌడ్

**బేగంబజార్, సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని మూసి పరివాహక ప్రాంతాల్లో దోమల బెడదను నివారించాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు మునకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ జిహెచ్ఎంసి అదనపు కమీషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలోని అనేక బస్తీలలో చీకటి పడిదంటేదోమల బెడద తీవ్రంగా మారుతుందన్నారు. ముఖ్యంగా మూసిపరివాహక ప్రాంతం కావడంతో బస్తీలల్లో దోమలు సైర్యవిహారం చేస్తూ స్థానికులను కంటి మీద కునుక లేకుండా చేస్తున్నట్లు వివరించారు. దోమల బెడదతీవ్రతరంతోపాటు దోమకాటు వలన విషజర్వాల బారిపడి ఆసుప్రతుల చుట్టు ప్రదక్షిణాలు చేయాల్సి వస్తుందన్నారు. దీంతో స్పందించిన జిహెచ్ఎంసి కమీషనర్ రవికిరణ్ వెంటనే మూసి పరివాహక ప్రాంతాలల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలోబిఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులస్తుల సంక్షేమ కోసం పాటుపడతాం : రాజ్‌గోపాల్ మేరు

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కీర్తి రాజ్‌గోపాల్‌మేరును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మేరు కులస్థులు విద్య,ఉద్యోగ,రాజకీయ,వ్యాపార రంగాలల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్షులుగాఎన్నుకున్న కులస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మేరు కార్పొరేషన్ కన్వీనర్ సంఘం నాయకులు వెంకటరాజం, కో-కన్వీనర్ మాడిశెట్టి లక్ష్మినారాయణ మేరు, జిల్లా కమిటిలు, జె.ఎ.సి నాయకులు,మేరు మేధావుల సమక్షంలో సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని పాత జిల్లాలతోపాటు కొత్త జిల్లా పర్యటనలు చేసి మేరు కులస్థుల స్థితి గతులను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం మెరుకులస్థులకు అందించే విధంగా వారికి అండగా ఉంటామన్నారు. మేరు కులస్థులు విద్యాతోపాటు రాజకీయ రంగాలలో రాణించేందుకు దృష్టి సారించాలన్నారు. ఈ పదవి మరింత భాద్యత పెంచిందన్నారు. అను నిత్యం మేరు కులస్థుల సంక్షేమ అభివృద్ధి కోసం పాటు పడతానని రాజ్‌గోపాల్ తెలిపారు.

### సామాజిక సేవాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 ( ప్రభాతవార్త ) :** సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ అన్నారు. మదర్ లాండ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అలీ బాయ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని అమ్మవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సేవా కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జయసింహ అన్నదాన కార్యక్రమాన్ని ప్రాంరభించి ప్రసంగించారు. నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అలీ బాయ్‌ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, రాంనగర్ శ్రీను, కే. శ్రీను, ఎద్దుల మల్లేష్, రాజ్ కుమార్, మాధవ్, వెంకటేష్, కృష్ణంరాజు, చాణిక్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు మందకృష్ణ మాదిగకు ఆహ్వానం



ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను కలిసిన హరినగర్ బస్తీవాసులు

**చిక్కడపల్లి సెప్టెంబర్ 4 ( ప్రభాతవార్త ) :** రాంనగర్ డివిజన్ పరిధిలోని హరినగర్ బస్తీలో నిర్వహించనున్న మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగను శుక్రవారం ఆలయ నిర్వాహకులు సుధాకర్, బస్తీవాసులు గురువారం మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాల వివరాలను మందకృష్ణ మాదిగకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎమ్ఆర్‌పిఎస్ హైదరాబాద్ జిల్లా నాయకులు గజ్జల రాజశేఖర్ మాదిగ, సీనియర్ నాయకులు తాండ్ర మురళి మాదిగ, నియోజకవర్గ నాయకులు బి. సత్యనారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి సంగీతంతో అలరించిన అచ్యుత అనంత కీర్తనం



కార్యక్రమంలో పాల్గొన్న గాయనిమణులు

**హైదరాబాద్ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా హోప్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుత అనంత కీర్తనమ్ పేరిట ప్రత్యేక భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. జంటనగరాలకు చెందిన ప్రముఖ కళాకారిణి ప్రతిమ శశిధర్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణుడిపై ఆధారిత పలు భక్తి కీర్తనలను ఆలపించారు. ప్రతిమ శశిధర్‌తో పాటు గాయనీమణులు సుశ్రుత, మేఘన, ప్రజ్ఞ, అలంకృత తమ మధుర గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. వారి ఆలాపనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన, కరతాళ ధ్వనులు లభించాయి. ఈ సందర్భంగా మహీధర సీతారాం భగవద్గీత ప్రాశస్త్యాన్ని, దాని బోధనల విశిష్టతను వివరించారు. గీతా బోధనలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు నిత్య జీవితంలో సమతుల్యతతో ముందుకు సాగేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను చూపుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కీబోర్డుపై గురుప్రసాద్, తబలాపై జయకుమార్ ఆచార్య అందించిన సహకారం సంగీత ప్రదర్శనకు మరింత శోభను చేకూర్చింది. కార్యక్రమం ముగింపులో సంస్థ ఎండీ కె.ఎస్. రావు ప్రతిమ శశిధర్ ,కళాకారులను ఘనంగా సత్కరించారు. భక్తి, సంగీత సమ్మేళనంగా సాగిన కార్యక్రమం ఆధ్యాత్మికానందాన్ని పంచింది.

# వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



స్వామి రామానంద తీర్థలో శ్రీకృష్ణమి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్సీ వాణీదేవి.




బోయిన్‌పల్లిలో క్రిష్టాష్టమి వేడుకల్లో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి,పాండు యాదవ్,ముప్పిడి మధుకర్



బోయిన్‌పల్లిలో నిర్వహించిన శ్రీ క్రిష్ణ జన్మాష్టమి వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్



గుడిమల్కాపూర్ పరిధి బాలాజీ నగర్‌లో జరిగిన కృష్ణష్టామి వేడుకల్లో కావియన్, అన్వికలు..



వివేకానంద్‌నగర్‌లోని శ్రీ సాయి చైతన్య పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు.



చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్ గౌడ్



కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న దిడ్డి రాంబాబు



శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్



శ్రీకృష్ణ జన్మాష్టమి పూజల్లో పాల్గొన్న దత్తాత్రేయ, కోట నీలిమ, మేచినేని శ్రీనివాసరావు తదితరులు.



అవంతి డిగ్రీ పీజీ కళాశాలలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



మిశ్రీగంజ్‌లోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు




ఆర్.కె.మిషన్ స్కూల్లో రాధాకృష్ణుల వేషధారణలో ముద్దులొలికిస్తున్న చిన్నారులు

## బిసిల భూమి జోలికి వస్తే సహించేది లేదు : బిసి నేతలు

**సైఫాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా బిసిలకు సంబంధించిన భూముల విషయంలో జరుగుతన్న పరిణామాలపై సహించేది లేదని పలు బిసి సంఘాల నాయకులు హెచ్చరించారు. రక్షించాల్సిన వారే భక్షిస్తే సమాన్యుడు ఎవరిని అశ్రయించాలని ? త్వరలో డిజిపికి ఫిర్యాదు చేస్తామని బిసి నేతలు హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, రావుల కోల నరేష్ ప్రజాపతి తదితరులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం, అజీజ్‌నగరం గ్రామంలోని సర్వే నెంబరు 22, 22/ఆ, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దామ అరుణ్‌కుమార్‌కు సంబంధించిన భూమి విషయంలో జరుగుతున్న పరిణామాలపై బిసి నేతలు అగ్రహం వ్యక్తం చేశారు. బిసిల భూముల విషయంలో అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతలు కోర్టు కేసులను, పోలీసులను అడ్డుపెట్టుకుని బలహీన వర్గాల భూములపై గద్దల్ల వాలిపోతు బిసిలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ విషయంలో న్యాయం జరగకపోతే బిసిలు మున్సిపల్, హైడ్రా కార్యాలయాలను ముట్టిడిస్తారని వారు హెచ్చరించారు. ఆ భూమిలో ఉన్న ప్రహరిగోడను కొంత మంది గుండాలు అన్యాయంగా కూల్చివేశారని ఆరోపించారు. తక్షణమే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ పోవాలి ..బిఆర్ఎస్ రావాలి

**-ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసింది : పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**



**అత్తాపూర్ సెప్టెంబరు4,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి వర్గాన్ని మోసం చేసిందని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పాలన పోవాలి మళ్లి బిఆర్ఎస్ పాలన రావాలని కెసిఆర్ సిఎం కావాలని కోరుకుంటున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దుర్గానగర్ చౌరస్తాలో మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేశ్, గుమ్మడి కుమార్ అధ్యక్షతన వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అలాగే కేసీఆర్ కిట్ పథకం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాల అమలుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సమయంలో మహిళలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని కార్తీక్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, ముక్కి చందా, రామ యాదవ్, రాజేష్ యాదవ్, అక్కెం రఘు, ప్రేమ్ గౌడ్, కొనమొల్ల శ్రీనివాస్, మంచర్ల మోహన్ రావు, శశి కుమార్, సలీం, మైసి రెడ్డి, జహీర్ ఖాన్, జీవన్ దాస్, ప్రవీణ్, సూర్యం, ఈర్లపల్లి ప్రవీణ్, కొంపల్లి జగదీష్, చిన్న, వెంకటరమణ, ముఖేష్, యాదయ్య, దుర్గేష్, సరిత మహేష్, అరుణ రెడ్డి, సుగుణమ్మ, ప్రసన్న, పద్మ, పుష్పమ్మ మరియు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికపై యువకుడి అసభ్య ప్రవర్తన..

**బేగంపేట సెప్టెంబరు 4,ప్రభాతవార్త**

బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో 11సంవత్సరాల వయసు కలిగిన బాలిక పట్ల గుర్తు తెలియని యువకుడు అసభ్యంగా ప్రవర్తించి బెదిరించిన సంఘటనపై బేగంపేట పోలీసు స్టేషన్ లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం గం 4.30నిల సమయం లో 11 సంవత్సరాల వయసు కలిగిన బాలిక తమ ఇంటి దగ్గర నిలబడి స్నేహితురాలి కోసం ఎదురు చూస్తుంది. ఆ సమ యంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చి ఆమెను పిలిచి ఒక గదిలోకి తీసికెళ్లి గది లోపలి నుంచి గడియ పెట్టా దన్నారు. ఆ సమయంలో ఆ యువకుడు బాలిక పట్ల అసభ్యం గా ప్రవర్తించడంతో ఈ విషయాన్ని బయట ఎవరికైనా తెలియ జేస్తే నీ అంతు చూస్తానంటూ బాలికను బెదిరించాడన్నారు. దీంతో భయాందోళణలకు గురైన బాలిక గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. విషయం తెల్సుకున్న బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులను ఆశ్రయించారన్నారు. వారి ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేసారు.

## ఉత్తమ అధ్యాపక పురస్కారానికి సిటీ కళాశాల అధ్యాపకులు ఎంపిక



ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికైన అధ్యాపకులు వీరే

**చార్మినార్,సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులు రాష్ట్ర ప్రభుత్వఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికయ్యారని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2026వ విద్యా సంవత్సరానికిగాను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు పురస్కారాలను ప్రకటించింది. కాగా ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందినా జనీతి శాస్త్ర అధ్యాకుడు డాక్టర్.కె. భాస్కర్,రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్.బి.జ్యోతి,లైబ్రేరియన్ డాక్టర్‌సిహెచ్ రవికుమార్‌లు ఎంపికయ్యారనిఈ నెల 5వ తేదీన కోడంగల్‌లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో పది వేల రూపాయలతో పాటు మెడల్, సర్టిఫికెట్‌ను అందుకోనున్నారని ఆమె తెలియజేశారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికైన సిటీ కళాశాలకు చెందిన అధ్యాపకులకు ప్రిన్సిపాల్,అధ్యాపక,అధ్యాపకేతర బృందం అభినందనలు తెలియజేశారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్యకేసులో ఏడుగురు నిందితుల అరెస్టు

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** చేతబడి చేశాడన్న అనుమానంతో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని దారుణంగా హత్య చేసిన ఏడుగురు సభ్యుల ముఠాను ఫలక్‌నుమా పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒక మైనర్ ఉన్నాడు. రెండు ద్విచక్రవాహనాలు, ఆరు కత్తులు/బాకులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఎ.జావిద్ తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా వట్టేపల్లి ఫాతిమానగర్‌కు చెందిన మహ్మద్ మహబూబ్ అలీ (53) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. గత నెల 30వ తేదీ రాత్రి 9.30 గంటల ప్రాంతంలో స్థానిక అల్మాస్ హోటల్ ఎదురుగా అతనిపై కొంత మంది అగంతకులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన మహ్మద్ మహబూబ్ అలీని వెంటనే స్థానికంగా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుమారుడు మహ్మద్ షానవాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదు చేసి స్థానిక సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 3వ తేదీన ఆరుగురు నిందితులను, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మీర్జా మోహిన్ బేగ్, మహ్మద్ ఇమ్రాన్ అహ్మద్, మహ్మద్ నసీర్, షేక్ అక్రమ్, మహ్మద్ అబ్రార్ అలీ, మహ్మద్ సమీ ఎలియాస్ షట్టర్, ఒక మైనర్ (సిసిఎల్) ఉన్నారు. కాగా ప్రధాన నిందితుడు మీర్జా మోహిన్ బేగ్ తన తల్లి తాహీరా బేగంపై మృతుడు మహ్మద్ మహబూబ్ అలీ చేతబడి చేశాడని, అందువల్లే ఆమె దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు విశ్వసించాడు. అంతేకాకుండా తన మేనమామ మహ్మద్ ఖలీల్ మరణానికి మహబూబ్ అలీ చేసిన చేతబడే కారణమని అనుమానించాడు. బావ మరిది మహ్మద్ ఇమ్రాన్ అహ్మద్‌కు విషయాన్ని వివరించాడు. ఇమ్రాన్ అతనికి సహకరిస్తానన్నాడు. హత్య తరువాత బెయిల్ ఇప్పిస్తానని బేగ్ హామి ఇచ్చాడు. గత నెల 30వ తేదీన మహ్మద్ మహబూబ్ అలీ అల్మాస్ వద్ద ఉన్నట్లు తెలుసుకొని అందరూ అయాన్ దర్బార్ హోటల్ వద్ద సమావేశమై ఆయుధాలు సమకూర్చుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్ళి అలీని అడ్డుకున్నారు. అతని తల, ఛాతి, చేతులపై తీవ్రంగా దాడిచేసి నరికి చంపారు. అరెస్టు చేసిన నిందితులను పోలీసులు న్యాయ స్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పల నాయు డు, డిఐ జాకీర్ హుస్సేన్, క్రైమ్ సిబ్బందిని అధికారులు అభినందించారు.



పోలీసుల అదుపులో హంతకులు

## కాంగ్రెస్ నేత సోదరుడి కారుకు నిప్పు

### బాచుపల్లిలో ఉద్రిక్తత



దగ్ధమైన కారు

**కొంపల్లి, ప్రభాతవార్త 4 ప్రభాతవార్త :** కాంగ్రెస్ నాయకుడి సోదరుడి కారును గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్‌పోసి నిప్పంటించారు. ఈసంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిపిఆర్ కాలనీలో గురువారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో చోటుచేసుకుంది. బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ దాల్‌నాయుడు కథనంప్రకారం గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో జిపిఆర్ లేఅవుట్‌లోని తన ఆఫీసులో నర్సా రెడ్డి వీరారెడ్డి ఆఫీసు పనులు చేసుకుంటూ బిజీగా ఉన్నాడు. అకస్మాత్తుగా గుర్తుతెలియని వ్యక్తులు కొందరు వ్యక్తులు కార్యాలయం ముందు ఉన్న తనకారుపై పెట్రోల్‌పోసి నిప్పంటించారు. అనూహ్యంగా జరిగిన ఈసంఘటనతో షాకుకు గురైన ఆయన గట్టిగా ఆరవడంతో కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తంచేయడంతో దుంగడులు పారిపోయారు. దీనితో అతడు వెంటనే బాచుపల్లి పోలీసులకు ఫోన్‌ద్వార సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు నిందితులకు సంబంధించిన ఆధారాలు ఏమీ లభ్యంకాలేదు. దీనితో కేసు నమోదు చేసుకుని అన్నికోణాల్లో తమద్యాప్తును వేగవంతం చేశారు. అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికతను ఉపయోగించుకుని వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని బాచుపల్లి పోలీసులు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతిరెడ్డికి వీరారెడ్డి స్వయంగా సోదరుడు. జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తును వేగవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. పాతకక్షలు, వ్యాపార పరమైన తగవులు, ఇతరత్ర కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. జరిగిన ఘటనపై సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు ఈవ్రంగా పరిగణిచి నిందితుల కసం ముమ్మరగాలింపు చర్యలను పోలీసులు చేపట్టారు.

## ఘనంగా కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలు



ఉమారాణి సన్మానిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర తొలి మేయర్, పత్రికా సంపాదకుడు, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకుముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి ముదిరాజ్ జీవిత చరిత్ర పుస్తకాలను విడుదల చేశారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఎంతో సేవ చేసిన కొరివి కృష్ణస్వామి అందరికీ ఆదర్శనీయుడని వారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎన్నికైన ఉమారాణి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీ చైర్మన్ అంజమ్మ ను అతిథులు సన్మానించారు.

## ఉప్పల్‌లో క్లినిక్ నిర్వహిస్తున్న నకిలీ వైద్యుడు అరెస్ట్

**ఉప్పల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ఎలాంటి అర్హతలు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న నకిలీ వైద్యుడిపై ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ గాంధీనగర్‌లో ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండా కడవేరు రామకృష్ణ వ్యక్తి క్లినిక్ నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్న కడవేరు రామకృష్ణపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు గాంధీనగర్‌లోని అభినయ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌పై దాడి చేశారు. నకిలీ వైద్యుడు కడవేరు రామకృష్ణ చికిత్సలు అందిస్తున్నట్లు ధృవీకరించారు. పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, వైద్య సిబ్బందితో కలిసి గాంధీనగర్‌లోని సంబంధిత క్లినిక్‌పై తనిఖీలు నిర్వహించారు. సదరు కె. రామకృష్ణ అనే వ్యక్తి ఎలాంటి చెల్లుబాటు అయ్యే వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే వైద్యుడిగా వ్యవహరిస్తూ ప్రజలకు చికిత్స అందిస్తున్నాడని తెలిపారు. ఆయన వద్ద నుంచి వైద్య వృత్తి నిర్వహించడానికి అవసరమైన ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా తనిఖీల్లో క్లినిక్‌లో రోగులకు చికిత్స అందిస్తున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి పలు వైద్య సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అర్హతలు లేకుండా వైద్య సేవలు అందించడం ద్వారా అమాయక ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.